క్లుప్తంగా

తరలిరండి..



మాట్లాడుతున్న చింతాడ సూర్యనారాయణ, కలమట రమేష్‌బాబు, తదితరులు

కొత్తూరు: కూటమి ప్రభుత్వ వైల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని, ఈ నెల 13న రైతుల సమస్యలపై పార్టీ పిలుపు మేరకు మండల స్థాయిలో పోరాటం చేస్తామని కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కలమట రమేష్‌బాబు అన్నారు. కొత్తూరులో శనివారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, సర్పంచ్‌లు నాస బాలకృష్ణ, నాగేంద్ర, ధర్మారావు, తులసి, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిమ్మగడ్డ కృష్ణారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వడమ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తిరల్లంగి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగహన



మాట్లాడుతున్న ఏడీ రవీంద్రభారతి

నరసన్నపేట: రబీలో మినుము, మొక్కజొన్న పంటలకు బీమా కావాలంటే రైతులు విధిగా ప్రీమియం చెల్లించాలని ఏడీ రవీంద్రభారతి అన్నారు. మండలంలోని ఉర్లాంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు రబీ పంటల బీమాపై అవగాహన కల్పించారు. మినుము పంట ఎకరాకు రూ.300 చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టం జరిగితే రూ.18 వేల పరిహారం వస్తుందన్నారు. మొక్కజొన్నకు రూ.579 చెల్లించాలని నష్టం జరిగితే ఎకరాకు రూ.38 వేల పరిహారం వస్తుందన్నారు. ప్రీమియాన్ని మీ–సేవ, రైతు సేవా కేంద్రాల్లో కట్టవచ్చన్నారు. ఇన్స్యూరెన్స్ జిల్లా కో ఆర్డినేటర్ పి.సిద్ధేశ్వరరావు, ఏఓ కె.సునీత, రైతులు పాల్గొన్నారు.

1,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని బాణాపురం పంచాయతీ ఎగువబగడలో టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ ఆధ్వర్యంలో రణస్థలం, టెక్కలి ఎక్సైజ్ సిబ్బంది సమన్వయంతో సారా తయారీ స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. 1500 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ షేక్ మీరా సాహెబ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా తయారీ క్రయ, విక్రయాలకు అలవాటుపడిన వ్యక్తులను గుర్తించి పట్టుకుంటామన్నారు. సారా వలన కలిగే నష్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించినట్లు తెలిపారు. టెక్కలి, రణస్థలం ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి



అభిషేకాలు చేస్తున్న భక్తులు

సారవకోట: మండల కేంద్రంలోని శివరామపాత్రుని కోనేరు గట్టుపై ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్టి పురస్కరించుకుని కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు అర్చకుడు సోమేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ట్రెజరీశాఖ డీడీ రవికుమార్

పొందూరు: సబ్‌ట్రెజరీ కార్యాలయాలలో వివిధ శాఖల బిల్లులు, పనుల బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని స్థానిక ఎస్‌టీఓ కేవీఎస్ ప్రసాద్‌ను జిల్లా ట్రెజరీ శాఖ డీడీ సీహెచ్ రవికుమార్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించారు. పింఛన్‌దారులందరికీ సకాలంలో పింఛన్‌లు అందుకునేలా సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యాయలంలో రికార్డులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. సిబ్బంది పి.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై..

కూటమి ప్రభుత్వం కక్ష!

- కనీస వసతుల్లేక అవస్థలు
- అధ్వానంగా రోడ్లు
- అలంకార ప్రాయంగా మంచినీటి కుళాయిలు



ఉర్లాంలోని జగనన్న కాలనీలో రోడ్డు దుస్థితి



గడ్డెయ్యపేట కాలనీలో అలంకారప్రాయంగా ఉన్న కుళాయి

నరసన్నపేట: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే పేరు గుర్తుకు వచ్చినా.. ఆ పేరు కనిపించినా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోంది. ఇప్పటికే గడిచిన ప్రభుత్వ కాలంలో ఉన్న వలంటీర్ వ్యవస్థను రూపుమాపింది. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోంది. జగనన్న పేరుతో వెలసిన కాలనీలపై దృష్టి పెట్టింది. ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు నానా ఇబ్బందులకు గురి చేస్తోంది.

గత ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం..

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసింది. ప్రతి పేద కుటుంబానికీ ఇంటి పట్టా ఇచ్చి, ఇల్లు కట్టుకొవడానికి అవకాశం ఇచ్చింది. కొత్త, కొత్త కాలనీలు, గ్రామాలు ఏర్పడ్డాయి. సగానికి పైగా గృహప్రవేశాలు జరిగాయి. తమ కలలను ప్రజలు సాకారం చేసుకున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆనాటి ప్రభుత్వం కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. విద్యుత్, రోడ్లు, మంచినీటి కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. నిధులు కొంత మేరకు వచ్చాయి. ముందుగా విద్యుత్ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. తదుపరి రోడ్లు వేసి మంచి నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ లోగా సార్వత్రిక ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది.

ఎక్కడ పనులు అక్కడ నిలిపివేత

నరసన్నపేట టౌన్ పరిధిలో ఉన్న 9 జగనన్న కాలనీల్లో విద్యుత్ పనులు పూర్తిచేశారు. రూరల్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ పనులు ఆగిపోయాయి. రోడ్లు, మంచి నీరు గురించి అసలు పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు ఎంపీడీఓతోపాటు గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు వస్తున్నా.. ఇళ్ల నిర్మాణం కోసం ఒత్తిడిలు చేస్తున్నారే తప్ప.. కనీస వసతుల కోసం పట్టించుకోవడం లేదు. కాలనీల్లో నివసిస్తున్న లబ్ధిదారులు అధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నా ప్రయోజనం ఉండటం లేదు. నరసన్నపేట టౌన్ పరిధిలో గడ్డెయ్యపేట, రావాడపేటల వద్ద నిర్మించిన జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో రోడ్లు లేవు. ఉర్లాంలోని పరిస్థితి కూడా అలాగే ఉంది. మరికొన్ని కాలనీల్లో అసలు రోడ్లే లేవు. గడ్డెయ్యపేట కాలనీలో కుళాయిలు వేసినా నీరు రావడం లేదు. వర్షా కాలంలోనూ తాగునీటికి ఇబ్బంది పడ్డారు. వేసవి వస్తే పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జగనన్న కాల నీల్లో కూడా మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో జగనన్న కాలనీల వివరాలు ఇలా..

మండలం	నరసన్నపేట	పోలాకి	జలుమూరు	సారవకోట
జగనన్న కాలనీలు	47	25	30	22
మంజూరైన ఇళ్లు	2,526	2,057	1,616	370
పూర్తయినవి	1,466	1,503	1,266	74

తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం



కాలనీల్లో ప్రతి ఇంటికీ కుళాయిలు వేశారు. అలంకార ప్రాయంగానే ఉన్నాయి. తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. కొందరు బోర్లు తవ్వించుకున్నారు. అక్కడకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం.. వేసవి వస్తుందంటే భయంగా ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– అంప్లాం చిట్టెమ్మ, జగనన్న కాలనీ, గడ్డెయ్యపేట

నడవలేక పోతున్నాం



మేము ఉంటున్న కాలనీల్లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. అప్పట్లో గ్రావెల్ రోడ్లు వేశారు. రోడ్లు అన్నీ గోతులమయంగా ఉన్నాయి. చీకటి పడిందంటే నడవడానికి ఇబ్బంది పడుతున్నాం. పక్కాగా రోడ్లు నిర్మించాలి.

– బోర సింహాచలం, జగనన్న కాలనీ, రావాడపేట

సదుపాయాలు కల్పిస్తాం



జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పణకు చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లు, మంచినీరు అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నాం. నిధులు వస్తే పనులు చేపట్టేందుకు తమ వంతుగా సహకారం అందిస్తాం. ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్తాం.

– రాజేంద్ర ప్రసాద్, గృహనిర్మాణ శాఖ ఏఈ, నరసన్నపేట

తల్లికి వందనం అందేది ఎప్పుడు?



- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మీటింగ్ ఉద్దేశం ఎన్నికల మేనిఫెస్టోను పూర్తిగా పక్కదారి పట్టించడం కోసమేనని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వంలో అందించిన వసతి దీవెన, విద్యా దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలకు ఈ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపుపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.

గత ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో విద్యా రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చామన్నారు. డిజిటల్ విద్య, ఇంగ్లిష్ మీడియం తీసుకువచ్చామన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించి, వారి పిల్లలను పాఠశాలలకు పంపేందుకు ప్రోత్సహించడంలో ఇది ప్రధాన పాత్ర పోషించిందన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టిక ఆహారం అందిచామన్నారు. సీబీఎస్‌సీ, ఐబీ వంటి ఖరీదైన కోర్సులను పేద విద్యార్థులకు ఉచితంగా అందించామన్నారు.

నేడు పూర్తిగా నిర్లక్ష్యం..

ప్రస్తుత ప్రభుత్వం, అంతకు ముందు చంద్రబాబు పాలనలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పెద్ద సంఖ్యలో మూసివేశారని, మౌలిక వసతుల కొరత వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయడంలో కూడా చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పాఠశాలల ప్రైవేటీకరణతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. ఒకానొక దశలో కార్పొరేట్ కంపెనీలు ప్రభుత్వ విద్య బాధ్యతలు తీసుకోవాలని చంద్రబాబు బహిరంగంగా చెప్పడం చూస్తే పేద విద్యార్థుల పట్ల ఆయన నిబద్ధత ఏ పాటిదో అర్థం అవుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించేందుకు, పాఠశాలల పునరుద్ధరణలో గత ప్రభుత్వ విజయాలను కొనసాగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



నీటి గుంతలోని చెత్తను తొలగించిన తరువాత ఇలా..

సారవకోట: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఉన్న నీటి గుంత (వాటర్ హార్వేస్టింగ్)లో ఉన్న చెత్తను అధికారులు శనివారం తొలగించారు. ఈ నెల 5న సాక్షిలో ఆనవాళ్లులేని నీటి గుంత అనే వార్త ప్రచురితమైంది. దీనిపై స్థానిక అధికారులు స్పందించి నీటి గుంతలో ఉన్న చెత్త, ఆకులను తొలగింపజేశారు.

రూ.10 వేల విరాళం



హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.నర్సింహంకు మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు శనివారం రూ.10 వేలు అందించారు. పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌కు అవసరమైన కుర్చీలు కొనుగోలు చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. తన తండ్రి రామ్మూర్తి జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేసినట్లు శ్రీనివాసరావు చెప్పారు. ప్రతీ ఏడాది రూ.10 వేల చొప్పున్న పాఠశాలకు అందజేస్తున్నారు. గతంలో ఇదే పాఠశాలలో రూ.మూడు లక్షలతో తరగతి గదిని నిర్మించారు.

నడకతో ఆరోగ్యం



వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు దీర్ఘకాలిక వ్యాధులు సుగర్, బీపీని అదుపులో ఉంచుకోవచ్చని ప్రముఖ వైద్యుడు గొలివి మోహన్‌రావు అన్నారు. నరసన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ సాహు ఆధ్వర్యంలో శనివారం మహిళలకు వాకింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. క్లబ్ కార్యదర్శి సాయిరాం, ట్రెజరర్ ఆర్.శ్రీధర్(బుజ్జి), సభ్యులు రంగనాథ్, గురుదేవ్, బాలగంగాధర్, కె.ఎల్.ఎన్.మూర్తి, అరుణ్‌దీప్, రమేష్, బోయిన బాలకృష్ణ, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. – నరసన్నపేట

వితరణ



మెళియాపుట్టి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు పాతపట్నం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖరెడ్డి శనివారం 50 కుర్చీలు వితరణగా అందించారు. పాతపట్నానికి చెందిన మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ పేరున అందజేసినట్లు తెలిపారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – మెళియాపుట్టి

అవగాహన



సులువుగా పండే వాణిజ్య పంటలను రైతులు వేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చిట్టిబాబు, సంధ్యారాణి తెలిపారు. సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. దున్నకుండా మొక్కజొన్న నాటడం, చీడపీడల నివారణ గురించి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తులు అత్తులూరి లావణ్య, బాన్న రాజ్‌కుమార్ పాల్గొన్నారు. – సరుబుజ్జిలి

అధ్వానం



ఈ చిత్రం కేకేరాజపురం–టీఆర్‌రాజుపేట మధ్యలో అధ్వానంగా ఉన్న రహదారి దుస్థితి. బూర్జ మండలంలోని శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారి కొల్లివలస జంక్షన్, నీలాదేవిపురం మలుపు మధ్యలో గోతులమయంగా తయారైంది. బస్సులు, లారీలతో రద్దీగా ఉండే రహదారిలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. – బూర్జ

సారాతో పట్టుబడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణారావు

పాతపట్నం: సారా తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మకాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు హెచ్చరించారు. మండలంలోని సవర సిద్ధమనుగు పంచాయతీ పరిధిలోని బొన్ని గిరిజన గ్రామంలో సారా తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలపై శనివారం అవగాహన కల్పించారు. మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ పాడవుతయన్నారు. సారాతో పట్టుబడితే చట్టం ప్రకారం రెండేళ్లు జైలు శిక్ష, రూ.రెండు లక్షల జరిమానా విధిస్తామన్నారు. రెండో సారి దొరికితే జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల జరీమానా ఉంటుందన్నారు. తహసీల్దార్ వద్ద నలుగురు వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందని సీఐ తెలిపారు.

ముగిసిన శిక్షణ



ధ్రువపత్రాలతో విస్తరణాధికారులు

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో మత్స్య శాఖలో పనిచేస్తున్న విస్తరణాధికారులకు చేపల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలు తెలుసుకునేందుకు గత ఐదు రోజులుగా చేపట్టిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమం జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ వారి సౌజన్యంతో నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విస్తరణాధికారులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా చేపలు, రొయ్యల్లో వ్యాధి నిర్ధారణ, యాజమాన్య పద్ధతులపై కర దీపిక విడుదల చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త సి.హెచ్.బాలకృష్ణ, శాస్త్రవేత్తలు, సిబ్బంది, క్షేత్రస్థాయి విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం



మట్లాడుతున్న డీఈఓ తిరుమల చైతన్య

జలుమూరు: విద్యార్థుల ప్రగతిలో ఉపాధ్యాయుల తోపాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని డీఈఓ సదాశివుని తిరుమల చైతన్య అన్నారు. శనివారం యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం చదివితే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చన్నారు. సర్పంచ్ మెండ రవి, హెచ్‌ఎం రఘునాథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగనాథన్ విగ్రహావిష్కరణ



రంగనాథన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయం ఆవరణలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రంథాలయశాస్త్ర పితామహుడు, పద్మశ్రీ ఎస్.ఆర్.రంగనాథన్ విగ్రహాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం ఆవిష్కరించారు. గ్రంథాలయానికి ఎంపీ రామ్మోహన్ నాయుడు రూ.75 వేల విలువ గల బీరువా వితరణగా అందజేశారని గ్రంథాలయాధికారి కాళ్ల రాజు తెలిపారు. పి.రామరాజు, వైస్ ప్రిన్సిపాల్ చక్రవతి, మధుబాబు, పైల బాబ్జి, సైలాడ సతీష్, శిర్ల ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పాతపట్నం ప్రభుత్వ ఉన్నత, పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపీడీఓ చంద్రకుమారి, ఎంఈఓలు గోవిందరావు, తిరుమలరావు, హెచ్‌ఎంలు వైకుంఠరావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

అలరించిన ఏకపాత్రాభినయం



అల్లూరి పాత్రలో విద్యార్థి

జలుమూరు: మండలంలోని రావిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలువురు జాతీయ నాయకుల ఏకపాత్ర అభినయంతో ఆకట్టుకున్నారు. ఇందులో రాణి రుద్రమ్మదేవి, అల్లూరి సీతారామరాజు తదితర పాత్రల్లో విద్యార్థులు ఒదిగిపోయారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయమేదీ?



- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవ అని పేరు మార్చి కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పటివరకు రైతుల ఖాతాలో ఒక్క పైసా కూడా జమ చేయలేదన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసిపోయిందని, పెట్టుబడి సాయం ఎప్పుడు అందిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విజనరీ అని చెప్పుకొనే చంద్రబాబుకు అన్నం పెట్టే రైతు లంటే ఎప్పుడూ చులకన భావమేనన్నారు. తాజా బడ్జెట్లో చేసిన కేటాయింపులు కేవలం రూ.వెయ్యి కోట్లు మాత్రమేనన్నారు. ఈ మొత్తాన్ని పీఎం కిసాన్ లబ్ధిదారులకు మాత్రమే జమ చేసినా.. ఒక్కో కుటుంబానికి ఈ ఏడాది రూ.4 వేలకు మించి పెట్టుబడి సాయం అందే పరిస్థితి కనిపించడం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందిందని గుర్తుచేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలను ఇంటి వద్దకే అందించామన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా అందించి ఆదుకున్నామన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సొంత భూమి ఉన్న రైతుతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కౌలు రైతులు, ఆర్.ఓ.ఎఫ్.ఆర్(అటవీ), దేవాదాయ భూములు సాగుచేసుకుంటున్న వారికి కూడా రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందించామన్నారు. దళారీల చేతిలో రైతన్న మోసపోకూడదనే ఉద్దేశంతో విత్తనం నుంచి విక్రయం దాకా రైతు భరోసా కేంద్రం ద్వారా రైతుకు అండగా నిలిచామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

సారవకోట: మండల కేంద్రంలో తాటినీటి సమస్య తీవ్రంగా ఉందని, దీనిపై గత సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సారవకోటలోని శివరామపాత్రుని కోనేరు పూడికతో నిండిపోయిందని, దీనిని గతంలో తొలగించారన్నారు. మరలా పూడికలు అధికమయ్యాయని, కోనేటి నీరు స్నానాలకు ఉపయోగంలో లేకుండా పోయిందన్నారు. అవలింగి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వాహణకు ఉపాధి హామీ వేతనదారులను రోజుకు ఒకరు చొప్పున కేటాయించి, వారికి ఉపాధి హామీ నుంచి వేతనాలు మంజూరు చేసేలా చూడాలని సర్పంచ్ కింజరాపు ధర్మారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. 2024–25 సవరణ బడ్జెట్‌లో రాబడిగా రూ.94,67,81,000, వ్యయం రూ.94,67,72,000 చూపడమైంది. 2025–26 అంచనా బడ్జెట్‌లో రాబడిగా రూ.100,38,80,000, వ్యయంగా రూ 100,38,71,000 చూపించారు. ఈ బడ్జెట్‌ను సభలో ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఉంచగా.. సభ్యులు ఆమోదించారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, వైస్ ఎంపీపీ ఎడ్ల అసిరయ్య, తహసీల్దార్ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆమదాలవలస: డ్రగ్స్ వద్దు బ్రో .. జీవితమే ముద్దు అంటూ స్థానిక సీఐ పి.సత్యనారాయణ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రోచర్‌ను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి విడుదల చేశారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ స్థాపన కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. చిన్నారుల జీవితాలు చీకటిమయం కాకుండా ఉండేందుకు డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమంపై అన్ని విద్యా సంస్థల్లోనూ అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితం నాశనం అవుతుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు.